18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
గురువారం | 27 మార్చి 2025 | పేజీలు 9

# అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**గూడూరు, మేజర్‌న్యూస్:** ముత్యాలమ్మ దేవస్థానం అభివృద్ధితో తీరప్రాంతపర్యాటక ప్రాంతంగా మారుతోందని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. బుధవార ఉదయం చిల్లకూరు మండలం తూర్పకనుపూరులో జరగుతున్న పోలేరమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంఎల్‌సి రవిచంద్ర, ఎంఎల్‌ఏ సునీల్‌కుమార్, పెంచలకోన దేవస్థానం మాజి ధర్మకర్తల మండలి ఛైర్మెన్ తానంకి నానాజిలకు దేవాదాయశాఖ అధికారులు, ఫెస్టివల్ కమిటీ సభ్యులు ఆలయ సాంప్రదాయాల ప్రకారం పూర్ణ కుంభ స్వగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న ప్రజా ప్రతినిధులకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రవిచంద్ర మాట్లాడుతూ దినదిన ప్రవర్థమానంగా విరాజిల్లుతున్న ముత్యాలమ్మ వారి దేవస్థానం పర్యాటక ప్రాంతంగా మారుతోందన్నారు. కృష్ణపట్నం పోర్టు, బకింగ్ హాం కాలువల ఆధునీకరణతో ఈ ప్రాంతం పారిశ్రామికీకరణ కూడా

మిగతా 8లో



# కడుపు మాడుస్తున్న ఉపాధి హామీ పథకం




జనవరి 15 తర్వాత ఇంతవరకు విడుదల కాని 'ఉపాధి'

**తిరుపతి జిల్లాలో పేరుకుపోయిన వేతనాలు**

**బకాయిలు ఇదిగో వస్తాయి.. అదిగో వస్తాయి అంటూ సర్ది చెబుతోన్న అధికారులు**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** కనీస వేతనం గిట్టుబాటు అయినా, కాకపోయినా ఉపాధి పనులకు విధిగా హాజరవుతున్నా.. వేతనదారులకు వేతనాలు అందక నానాబాధలు పడుతూ సకాలంలో వేతనాలు లభిస్తాయన్న హామీ లేని "ఉపాధి" కల్పన ఎందుకు అన్న చందంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి డబ్బులు చేతిన పడితే ఇల్లు గడుస్తుంది కదా అన్న ఆశతో కష్టనష్టాలకోర్చి పనులు చేస్తున్నా ఫలితం దక్కడం లేదన్న చందంగా పలువురు వేతనదారులు వాపోతున్నారు. ఉపాధి పనుల కల్పన వరకు పడలేదనుకున్నా వేతనాలు అందని పరిస్థితి తమని ఇబ్బందుల పాల్జేస్తుందని అధిక సంఖ్యలో వేతనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనవరి 15 తర్వాత ఇంతవరకు ఉపాధి వేతనాలు అందలేదంటే వేతనదారుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో ఇట్టే అర్థ మవుతుంది. అధికారిక లెక్కల ప్రకారం చూసుకుంటే తిరుపతి జిల్లాకు సంబంధించి కోట్లమేర ఉపాధి వేతన బకాయిలున్నట్లు తెలుస్తోంది. ఇదిగో వస్తాయి.. అదిగో వస్తాయి.. అని సర్ది చెప్పడం మినహా అధికారుల చేతిలో ఏమీ లేదన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. వేతనాలు అందితే గంజో, కడుగో తాగి కడుపు నింపుకుందామని భావించిన ఎన్నో పేద కుటుంబాలకు ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. లక్ష్యాలు విధించుకొని



మిగతా 2లో

# పనిచేయని పోలీస్ ఈ చలానా యాప్

**ఇటీవల ఫైన్లను అమాంతంగా పెంచడమే కారణం**




**తిరుపతి, మేజర్‌న్యూస్:** ఏపీ పోలీస్ శాఖ, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్న పోలీస్ ఈ చలానా యాప్ గత మూడు వారాలుగా పనిచేయడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖకు ఫైన్‌ల రూపంలో రావలసిన డబ్బులు రాకుండా నిలిచిపోయాయి. ఈ చలానాయాప్ పని చేయకపోవడమే ప్రధాన కారణమని, ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫైన్లను అమాంతంగా పెంచేశారు. దీంతో ఆన్‌లైన్ పోలీస్ ఈ చలాన్ యాప్‌ను సరిదిద్దె క్రమంలోనే జాప్యంజరుగుతోందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ మూడు వారాలుగా పోలీస్ ఈ చలాన్‌యాప్ పనిచేయక పోవడంతో కోట్లాది రూపాయలు అపరాధ రుసుంల రూపంలో రాకుండా నిలచిపోయిందనే చెప్పవచ్చు.

**ఒక పక్క అవగాహన కార్యక్రమాలు**

జిల్లా ఎస్పీగా హర్షవర్ధన రాజు బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది. అయితే ఫైన్ల రూపంలో వసూలు చేసే అపరాధ రుసుంలు ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు జాప్యం ఏర్పడుతోంది. సెల్ ఫోన్ డ్రైవింగ్, అతి వేగంగా వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్, మైనర్ బాలురు, మైనర్ బాలికలు వాహనాలు నడపడం వంటి వారికి ఫైన్లు వేసే పోలీస్ ఈ చలానా యాప్ పనిచేయడం లేదు. అయితే ట్రాఫిక్ పోలీసులు గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు చెల్లించాల్సిన ఫైన్లను మాత్రం ఈ చలానా యాప్‌లో కట్టించే పనిలో నిమగ్నమయ్యారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌కు కోర్టులో చెల్లించాల్సిందే...** ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే మాత్రం కోర్టులో ఫైన్ల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు పెట్టీ కేసుల చలానా డబ్బులను

మిగతా 8లో

# వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టండి

**మేయర్ డాక్టర్ శిరీష**

**చలివేంద్రాలు ఏర్పాటు చేయండి : కమిషనర్ ఎన్.మౌర్య**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలోవేసవి కాలంలో నగర ప్రజలకు త్రాగునీటి ఎద్దడి రాకుండా, ఎండ నుండి ఉపశమనం కలిగేలా తగు చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం అన్ని విభాగాల అధికారులతో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వివరించారు. నగరంలో ప్రజలకు ఇబ్బందులు తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తుగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని, వేసవిలో వచ్చే సీజనల్ వ్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య సిబ్బందికి ఎండల వలన ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పలు చోట్ల నీరు వృధాగా పోతున్నదని అరికట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ప్రైవేట్ నీటి ట్యాంకర్ల యాజమానుల సమావేశం ఏర్పాటు చేసి ఒకే ధరకు నీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తిరుపతి నగరానికి పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని వారు ఎండల బారిన పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రధాన కూడళ్లలో చలువపందిళ్ళు, గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది పనివేళల్లో మార్పులు చేశామని, మస్టర్ పౌయింట్ల వద్ద తాగునీరు, పాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎండ వేడిమి



మిగతా 2లో



# వైద్య సిబ్బంది రోగుల పట్ల సానుభూతితో వ్యవహరించాలి

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గత ప్రభుత్వంలో పేరుకు పోయిన ఉద్యోగుల బకాయిలు దాదాపు 25 వేల కోట్లు కూటమి ప్రభుత్వం రూ.7,230కోట్లు ఇప్పటికే చెల్లించిందని మిగిలిన బకాయిలను కూడా ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే చెల్లిస్తుందన్నారు. ప్రతి ఉద్యోగి ఆనందంగా ప్రశాంత వాతావరణంలో మరింత ఉత్సాహంగా

మిగతా 2లో



## రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.26 (గురువారం)

సెహరి : 4.57 (శుక్రవారం)

## వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టండి

(మొదటిపేజీ తరువాయి)

నుండి తట్టుకునేలా తగు చర్యలు చేయాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఎక్కడా మురుగునీరు నిలకుండా, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, మేనేజర్ హాసీమ్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** తిక్కవరం ఉన్నత పాఠశాలలో బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు మధుబాబుపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం పాఠశాలలో బాలిక తల్లిదండ్రులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీనిపై చివరి వరకు సస్పెన్స్ నెలకొనగా చివరకు పోలీసు అధికారులు అర్ధ రాత్రి సమయంలో నిందితుడిపై ఫోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఆ చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని బెయిల్‌బుల్ సెక్షన్‌లు నమోదు చేసి పంపేయడంపై తీవ్రవిమర్శలు వ్యక్తం చేస్తున్నారు. బాలిక పట్ల ఉపాధ్యాయుడి గత కొద్ది కాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. ఏదిఏమైనా పోలీసుల వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి

**యాదమరి, మేజర్‌న్యూస్:** మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్డిఏ ఇంచార్జ్ పీడీ శ్రీదేవి అన్నారు. బుధవారం సుచి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పిడి మాట్లాడుతూ మహిళలు అని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుచి సంస్థ డైరెక్టర్లు గ్లోరీ పాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ సుజీ సమస్య ఏర్పాటు చేసి 42 సంవత్సరాలు అవుతున్నది. అప్పటినుండి ఇప్పటివరకు మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందేందుకు శిక్షణ ఇస్తూ వారికి సాంఘిక ఆరోగ్య ,అభివృద్ధి విద్య అభివృద్ధి, అన్ని రంగాల్లో వారికి తోడుగా సంస్థ పనిచేస్తుందని తెలిపారు. జిల్లా బి సి కార్పొరేషన్ పిడి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందడానికి టైలరింగ్ ఉచిత ట్రైనింగ్ మరియు కుట్టు మిషన్లో మంజూరు చేయడం జరుగుతుందనితెలియజేశారు యాదమరి ప్రభుత్వ వైద్యాధికారిణి సురేఖ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆరోగ్యంగా జీవించాలని ప్రతి ఒక్కరు పద్ధతి పాటించాలని తెలిపారు అదేవిధంగా సంస్థ ద్వారా కొంతమంది మహిళలు వారి యొక్కఅనుభవాలను మహిళలకు తెలియజేశారు మహిళలకు సంస్థ ద్వారా వారికి సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి మండలంలోని గ్రామ మహిళలు సుమారు 120 మంది హాజరైనారు. ఈ కార్యక్రమంలో సుచి స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బందులు సాంసన్ ధనలక్ష్మి జాన్సన్ వరదరాజులు జాకబ్ డి చిన్నయ్య ఎంఎస్ మనీ శశి కుమార్ మహిళలు పాల్గొన్నారు.




## వరదరాజ స్వామి గుడిని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలో వరదరాజ ఆలయ నిర్మాణం నడిరోడ్డులో పూర్తి కాకుండా ఉన్నది. సీతారామ కళ్యాణం ఏ ముహూర్తాన దశరథ మహారాజు తన పెద్ద కుమారుడికి శ్రీరామచంద్రుడని పేరు పెట్టాడో తెలియదు గానీ నవమి కష్టాలు మాత్రం ఇంకా తీరడం లేదు. అయోధ్య వివాదం ముగిసి అపురూప కట్టడం తయారయింది. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా యాత్రా స్థలంగా అభివృద్ధి చెందింది. ఆదాయం కూడా భారీగానే ఉంది. అయినా శ్రీరాముడికి కష్టాలు మాత్రం తీరడం లేదంటే అతిశయోక్తి కాదు. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు అనుబంధంగా పట్టణంలోని నెహ్రూవీధిలో శ్రీరామ మందిరం ఉంది. శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. అయితే కల్యాణ వేదిక పెద్ద సమస్యగా మారింది. సమీపంలో ఉన్న వరదరాజ స్వామి ఆలయ ఆవరణలో సీతారాములు కళ్యాణం వైభవంగా.. కమనీయంగా.. కనుల విందుగా జరిగేది. అయితే గత ప్రభుత్వ పాలకులు చేసిన అనాలోచిత నిర్ణయం కారణంగా ఇప్పటి వరకు ఆలయ పునర్ నిర్మాణం పూర్తి కాలేదు. ఆలయ ఆవరణ కూడా వ్యర్థాలతో నిండి ఉంది. దీంతో నెహ్రూ వీధిలోనే నడి రోడ్డుపై వేదిక ఏర్పాటు చేసి కళ్యాణం జరిపిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి. వరదరాజ స్వామి ఆలయ నిర్మాణం పునాదులు దాటలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో, ఎప్పటికి పూర్తి చేస్తారో ఆ వరదరాజులుకే తెలియాలి. నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం ఎక్కడ నిర్వహించాలనేది పెద్ద సమస్యగా మారింది. శ్రీరామ మందిరం స్థలం చాలా చిన్నది. అందువల్లే వరదరాజ స్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అక్కడ వాతావరణం సరిగా లేదని నడిరోడ్డులోనే వేదిక ఏర్పాటు చేసి కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అయితే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా పెళ్లి మండపం వద్ద ఆది దంపతుల కళ్యాణం జరుగుతుంది. ఆ వేదికలో సీతారాములు కళ్యాణం నిర్వహిస్తే అందరూ హర్షిస్తారు. శ్రీరాముడు ఎప్పుడూ "ఓం నమశివాయ" అనే పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ ఉంటాడని, పరమశివుడు "శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ తత్తుల్యం రామానామ వరాననే" అని అంటూ ఉంటాడని పెద్దలు చెబుతారు. అందువల్ల ఆది దంపతులు కళ్యాణ వేదికపై సీతారాములు కళ్యాణం జరిగితే ఎటువంటి దోషం కూడా ఉండదు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు ఆ దిశగా ఆలోచించి దశరథ మహారాజు కుమారుడు, జనక మహారాజుకి అల్లుడు, చక్రవర్తిగా రామరాజ్యం స్థాపించిన శ్రీరాముడికి పర్మినెంట్ ప్లేస్ కలగాలని భక్తుల కోరుతున్నారు.

## కడుపు మాడుస్తున్న ఉపాధి హామీ పథకం

(మొదటిపేజీ తరువాయి)

మరీ అధికారులు పనులు కల్పించేస్తున్నా వేతనాలు సకాలంలో అందకపోవడంతో అంతా ఉసూరుమంటు న్నారు. 2024-25 సంవత్సరానికి గానూ 1.81 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇంతవరకు 1.70 కోట్ల పనిదినాల కల్పన జరిగిందని డ్వామా అధికారులు చెబుతున్నారు. మిగతా పనిదినాల కల్పన ఏమంతా కష్టం కాకపోయినప్పటికీ వేతనాలు పడకపోవడం వల్ల ఉపాధి వేతనదారుల్లో నిర్లిప్తత చోటుచేసుకుంది. 2023-24 సంవత్సరానికి సంబంధించి 2.10 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం కాగా 2.18 కోట్ల పనిదినాలు కల్పించినట్లు అధికారిక లెక్కలు



చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ వేతనాలు సకాలంలో పొందలేక పోవడం వల్ల అధికశాతం మంది వేతనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నది నిర్వివాదాంశం. ఇప్పటికైనా బాధ్యులు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## వైద్య సిబ్బంది రోగుల పట్ల సానుభూతితో వ్యవహరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు సేవచేసేలా ప్రభుత్వం చూస్తుందని ఆయన తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఏపి హంస అసోషియేషన్‌కు మెడికల్ కాలేజి ఆవరణలో కేటాయించిన భవనాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం ఉదయం పరిశీలించారు. అలాగే భవన ఆవరణాన్ని ఆయన పరిశీలించారు. పాత భవనం కావడంతో మరమ్మత్తులు చేయాల్సి ఉందని ఏపిఎంఎస్ఐడిసి అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. 20లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసనట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఏపి హంస అసోషియేన్ ప్రతినిధులు తమకు ప్రత్యేకంగా కార్యాలయం కావాలని కోరడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి వారికి భవనాన్ని కేటాయింపు జరిగేలా చూసినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. మెడికల్ సిబ్బంది తమ చిన్న చిన్న అవసరాలు తీర్చుకోవడానికే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బందికి ఈ భవనం ఎంతో ఉపయోగంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిధులే కాకుండా దాతల నుంచి విరాళాలు సేకరించి త్వరగా మరమ్మత్తులు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపి హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాజ,సెక్రటరీ టాటా బాయి, కోశాధికారి ఇమ్రాన్, తిరుపతి సిటీ అధ్యక్షులు సురేంద్ర, సెక్రెటరీ ముని రాజా, ట్రెజరర్ శాంతకుమార్, కార్యవర్గ సభ్యులు, ఎన్డీఏ నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి, హెచ్‌డిఎస్ సభ్యులు బండ్ల లక్ష్మీపతి, కెఎంకె లోకేష్, ఆర్మాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, జానకిరామి రెడ్డి, ఉదయ్, ఆళ్వార్ మురళీ, శ్యామలాదేవి, హేమంత్ కుమార్, రాజేష్ ఆచ్చారి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించండి

### ప్రభుత్వ విప్ జి డి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్

**ఎస్ఆర్.పురం, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విప్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీడి నెల్లూరు నియోజకవర్గంలో బస్సుడిపోను ఏర్పాటు చేయాలని తద్వారా నియోజకవర్గ ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కూడా అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తయ్యారు మాజీ ఎంపీటీసీ తిరుమల తెలియజేశారు. పిల్లారి కుప్పం గ్రామానికి చెందిన కొందరు ఇళ్ల స్థలాలు లేవని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు అనంతరం రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రమోద్ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 1,92,476 చెక్కును లబ్ధిదారులకు అందజేశారు అదేవిధంగా రెవిన్యూ సమస్యలు భూ సమస్యలు సంక్షేమ పథకాల కోసం అర్జీలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ మురళి ఎమ్మార్వో లోకనాథం పిలై మండల పార్టీ అధ్యక్షుడు జయశంకర్ నాయుడు గుండయ్య రాజశేఖర్ నాయుడు మోహన్, మురళి, బాలాజీనాయుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## జోన్ల వారీగా వీధి విక్రయదారులు వ్యాపారాలు చేసుకోవాలి

### కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో వీధి విక్రయ దారులు కొరకు కేటాయించిన జోన్లలో వ్యాపారాలు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన వీధి విక్రయదారుల టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో వెండింగ్ జోన్స్ గ్రీన్ జోన్స్, అంబర్ జోన్స్, రెడ్ జోన్స్‌గా విభజించామని, కమిటీ మెంబర్స్ సమక్షంలో టౌన్ మ్యాప్ తయారు చేయడం జరిగిందన్నారు. దీని ప్రకారమే గ్రీన్ జోన్స్ ఉన్న దగ్గర ఎల్లవేళల వ్యాపారాలు నిర్వహించవచ్చని, అంబర్ జోన్స్ (రిస్ట్రిక్టెడ్ జోన్స్) నందు ఉదయం 6 నుండి 8 వరకు సాయంత్రం 6 నుండి 10 గంటల వరకు వ్యాపారం చేసుకోవచ్చని, రెడ్ జోన్స్‌లో పూర్తిగా వ్యాపాంం చేయకూడదన్నారు. వీధి వ్యాపారులు జోన్స్ విధానంలో వ్యాపారాలు చేయుటకు సమ్మతిస్తూ, తమకు ఫుడ్ స్ట్రీట్ ని ఏర్పాటు చేయవలసినదిగా కమిషనర్ ను కోరారు. 15 రోజుల తరువాత వీధి విక్రయ దారులకు రి-సర్వే నిర్వహించి అర్హులైన వీధి విక్రయ దారులకు జోన్స్ అలాట్ చేసి వారికి గుర్తింపు కార్డులను, వెండింగ్ సర్టిఫికేట్లను మంజూరు చేస్తామని కమిషనర్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో వీధి విక్రయదారులు పాల్గొని నగరానికి ప్రథమ స్థానం వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీసీపీ మహాపాత్ర, స్టాండింగ్ కమిటీ మెంబర్ దినకర్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణ, ఏసిపి బాలాజీ, మెప్మా సిఎంఎంలు కృష్ణవేణి, సోమకుమార్, గాయత్రి, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.



# క్రీడలు యువతకు మానసిక స్థైర్యం ఇస్తాయి :ఎమ్మెల్యే



**గూడూరు, మేజర్‌న్యూస్:** క్రీడలు యువతలో మానసిక స్థైర్యం కల్పిస్తాయని ఎంఎల్ఏ డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. పోలేరమ్మ జాతర సందర్భంగా తూర్పుకనుపూరు గ్రామంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. బుధవారం సాయంత్రం క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. జాతర గ్రామంలో క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అప్పారు. వివిధ గ్రామాల మధ్య వర్గాలు, వైషమ్యాలు లేకుండా క్రీడాస్పూర్తి వెల్లి విరిసింద న్నారు. దీంతోపాటు యువతలో గెలుపోటములు స్ఫూర్తిని స్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెంచల కోన ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మెన్ తానంకి నానాజీ, ఫెస్టివల్ కమిటీ సబ్యులు దశరధరామిరెడ్డి, తెలుగుదేశం నాయకులు బిల్లు చెంచురామయ్య, పట్టాభిరెడ్డి, వినయ్‌కుమార్, శివకుమార్, పెద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫ్యూజన్ బ్రిక్స్‌చే చలివేంద్రం



**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని తిక్కవరం గ్రామం ఉనన ఫ్యూజన్ బ్రిక్స్ పరిశ్రమ జాతరకు వెళ్లే భక్తుల సైకర్యార్థం చిలివేంద్రం ఏర్పాటు చేశారు. తూర్పుకనుపూరు జాతర గ్రామానికి వెళ్లే భక్తులకు వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు పరిశ్రమ ప్రతినిధి ప్రభాకర్ తెలిపారు. ప్రతి ఏడాది ప్రధాన రహదారిపై చలి వేంద్రం ఏర్పాటు చేస్తామని అలానే ఈ సారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సోమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలసిన నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. బుధవారం ఉదయం బిజెపి నాయకులు బూతు సుబ్రహ్మణ్యం, యారం వెంకటసుబ్బయ్యలు సోమిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కలసి జన్మిదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమిరెడ్డి మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవడంతలోపాటు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాక్షించారు.



## వైసీపీ కార్యకర్తను పరామర్శించిన నేదురుమల్లి

**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు మసీదు వీధికి చెందిన వైకాపా సీనియర్ నేత గౌసు ముహుద్దీన్ సతీమణి ఇటీవల హనీఫా మృతి చెందడంతో బుధవారం గౌస్ మొహిద్దిన్ నివాసానికి వెళ్లి గౌస్‌కుటుంబ సభ్యులను రామ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. గౌస్‌ని పరామర్శించి ధైర్యాన్ని నింపారు. తాను గౌస్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనవెంట వాకాడు ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, తిరుపతి జిల్లా వైకాపా అధికార ప్రతినిధి దామోదర్ రెడ్డి, సర్పంచ్ విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు సుధాకర్ నాయుడు,నాగూర్ రెడ్డి, శేషు రెడ్డి, నేదురుమల్లి శ్రీధర్ రెడ్డి, నెల్లూరు పెంచల్ రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, వాకాటి రవికుమార్ ఉన్నారు.



## చలివేంద్రం ఏర్పాటు

**వాకాడు, మేజర్ న్యూస్:** మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రత ఎక్కువవడంతో మండల పరిషత్ కార్యాలయంకి వచ్చే ప్రజల కోసం చలివేంద్రంను ఏర్పాటు చేశామని ఎంపీడీవో తెలిపారు. ప్రతిరోజు కూలింగ్ మంచినీరు ఉంటుందని దాహంను ప్రజలకు తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట ఈఓపిఆర్‌డి ఉమా మహేశ్వర రావు, మండల పరిషత్ సిబ్బంది, స్థానికులు ఉన్నారు.




## జాతర గ్రామంలో కోలాహలంగా భక్తులు

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** తూర్పకనుపూరు గ్రామం భక్తులతో కోలాహలంగా మారింది.





గంగమిట్ట వద్ద పోలేరమ్మను ప్రతిష్టించడంతో జాతరకు అంకురార్పణ జరిగింది. కుమ్మరి ఇంట తయారైన పోలేరమ్మ విగ్రహాన్ని వేడుకగా గ్రామస్తులు తీసుకు రాగ భక్తుల ఆనందోత్సాహాల మద్య అమ్మ వారిని గంగమిట్ట వద్ద ప్రతిష్టించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చల్లగా చూడాలని గాడిగంటల చెట్టు వద్ద కుంభం సోశారు. అప్పటి నంఉచి ముత్యాలమ్మవారుతోపాటు పోలేరమ్మ దర్శనాలు ప్రారంభమైనాయి. అంకమ్మ తల్లి, గురునాధ స్వామి గ్రామోత్సవం, గొల్లల వేడుకలు నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు మొదటి చాటింపు పూజలు

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర సందర్భంగా మొట్టమొదటగా జరిపే అమ్మణ్ణిచాటింపు పూజ వేడుకలను మంగళవారం అర్ధరాత్రి వేడుకగా జరిపారు. జాతర సందర్భంగా పెద్దకాపుగా వ్యవహరించే విన్నమాల గ్రామానికి చెందిన అరవభూమి శ్రీనివాసులు రెడ్డితో పాటు దేవదాయశాఖ అధికారులు కలిసి పోలేరమ్మ ప్రతిమ వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా పడమటి వీధిలోని పుట్టినింటి నుంచి ప్రత్యేకంగా మట్టితో తయారు చేసిన పోలేరమ్మ ప్రతిమను ఊరేగింపుగా తీసుకువచ్చి శెట్టిపల్లి వారి వీధిలో ఉన్న అమ్మణ్ణి అత్తారిలుగా పిలువబడే ప్రదేశంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. అక్కడి నుంచి పోలేరమ్మ ప్రతిమను కూడలి వద్దకు చేర్చి కుంభం పోసి పూజలను నిర్వహించారు. పోలేరమ్మ ప్రతిమను సమీపంలో ఉన్న విన్నమాల వారది వద్ద నిమజ్జనం చేశారు.







## జవహర్ నవోదయకు టీఎంఆర్ విద్యార్థులు

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** చిట్టమూరు మండలం కొత్తగుంటలోని టిఎంఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జవహర్ నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి బుధవారం తెలిపారు. 2025 జనవరి 18వ తేదీన నాయుడుపేటలో నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరైన టిఎంఆర్ పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులలో ఇద్దరు ఎంపికైనట్లు చెప్పారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో జవహర్ నవోదయకు ఎంపికైన టిఎంఆర్ విద్యార్థులు పి పవన్ జోషిత్, టి ఇషాదీక్షితలను పాఠశాల కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి, డైరెక్టర్ విజయ లక్ష్మి, ప్రిన్సిపల్ రహంతుల్లా, ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

గత రెండు సంవత్సరాల నుండి జవహర్ నవోదయపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తుండడంతో సీట్లు సాధించామన్న మనోహర్ రెడ్డి 2024లో ఒక విద్యార్థి ఎంపిక కాగా నవోదయకు శిక్షణ ప్రారంభించిన రెండో సంవత్సరం మరో ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేసి,శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు బి.గోపాల్, ఈ రూబేష్, పి రవిలను అభినందించారు. తీర ప్రాంత మండలంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, అత్యాధునిక పద్ధతులలో బోధన,ఉత్తమ శిక్షణతో, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ జవహర్ నవోదయలో వరుసగా రెండు సంవత్సరాలలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం క్రమశిక్షణ,ఉత్తమ శిక్షణ, ఉన్నత ప్రమాణాలతోనే సాధించామని మనోహర్ రెడ్డి మేజర్ న్యూస్ కు తెలిపారు.

## పురవీధుల్లో గంగమ్మ దర్శనం

**భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు**

**అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు**

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో సుగుటూరు గంగమ్మ జాతర మంగళ, బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం జమీందారుల తొలి పూజ అనంతరం రాత్రి అమ్మవారు పురవీధులలో సంచరించింది. పట్టణంలో అమ్మవారికి ఏడు గురు చెల్లెల్లు ఉండడంతో వారిని పలకరిస్తూ సుబేదారివీధి, కుమ్మరి వీధి, తూర్పు మగశాల ఇందిరాసర్కిల్ మున్సిపల్ బస్టాండ్ మీదుగా అమ్మవారి ఊరేగింపు జరిగింది. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే అమ్మవారి నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు అమ్మవారిని ఆలయంలో భక్తుల దర్శనం కోసం కొలువుతీర్చారు.





కర్ణాటక తమిళనాడు నుండి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మండలంలో 116 గ్రామాల నుండి అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్లు కిక్కిరిసాయి. ఈ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అపద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంను గమనిస్తున్న ప్రజలు

## నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

**వాకాడు, మేజర్‌న్యూస్:** అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తొంగలో తొక్కేస్తూ అన్ని గమనిస్తున్నా ప్రజలే రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పే రోజులు వస్తాయని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ మాజీ చైర్మన్, వెంకటగిరి నియోజవర్గ ఇన్చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి విమర్శించారు. బుధవారం వాకాడు నేదురుమల్లి నివాసంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైకాపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు రామ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు సూచనలు సలహాలు అడిగి తెలుసుకున్నారు. రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని జరుగుతున్న రాజకీయ అంశాలపై నాయకులతో చర్చించారు, కూటమి ప్రభుత్వం నాయకులు ప్రలోభాలకు, వత్తిళ్లకు గురి కావద్దని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చేసిందని, సూపర్ సిక్స్ పథకాలు తుంగలో తొక్కేసాడని రామ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం అండతో నాయకులు దోసుకుంటున్నారని ప్రజలు చూస్తూ ఊరుకోరని, ప్రజలు తిరగబడే సమయం వచ్చిందన్నారు. ప్రభుత్వం చేసే అరాచకాలను ఎదుర్కోవడానికి వైఎస్ఆర్సిపి పార్టీ సిద్ధంగా ఉందని, రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీకి అక్కండ మెజార్టీతో ప్రజలు గెలుపొందించడం జరుగుతుందని రెండోసారి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.



## టీటీడీకి 1.01 కోట్ల విరాళం

**తిరుమల, మేజర్‌న్యూస్‌:** రాజమహేంద్ర వరానికి చెందిన తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు, నున్న సరోజిని దేవి దంపతులు శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు బుధవారం రూ.1,01,11,111లు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం లోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఛైర్మన్, అదనపు ఈవో అభినందించారు.



## తిరుపతి పార్లమెంటు పరిధిలో
# చక్కెర కర్మాగారాల ఆధునీకరణ, విస్తరణ ఎప్పుడు?

**- లోక్ సభలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్న**



**తిరుపతి రెవెన్యూ, మేజర్ న్యూస్:** చక్కెర కర్మాగారాల ఆధునీకరణ, విస్తరణ గురించి బుధవారం పార్లమెంటులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పలు ప్రశ్నలను సంధించారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని చక్కెర కర్మాగారాల ఆధునీకరణ, విస్తరణ, చెరకు సాగు అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం రూపొందించిన విధానాలు, పథకాల వివరాలు తెలుపాలని కోరారు. చెరకు పంట మెరుగైన ఉత్పత్తి, నిర్వహణ సులభతరం చేయడానికి జాతీయ చక్కెర సంస్థ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో పరిశోధనలను నిర్వహించడానికి ప్రత్యేక పరిశోధనా సంస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రణాళికలు ఉన్నాయా అని ఎంపీ ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా సమాధానం ఇచ్చారు. చక్కెర కర్మాగారాల ఆధునీకరణ, విస్తరణ గుర్చి వివరిస్తూ దేశవ్యాప్తంగా చక్కెర పరిశ్రమ అభివృద్ధికి షుగర్ డెవలప్మెంట్ ఫండ్ యాక్ట్ 1982 ద్వారా మద్దతు ఇచ్చినా, ఈ లోన్ స్కీమ్‌ను 2021లో నిలిపేశారని తెలిపారు. దేశంలో ఎథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు 2018-2022 మధ్య కేంద్ర ప్రభుత్వం పలు వడ్డీ రాయితీ పథకాలను ప్రవేశపెట్టిందని తెలియజేశారు. చక్కెర మిల్లులకు కొత్త డిస్టిలరీల ఏర్పాటు, ఉన్న డిస్టిలరీల విస్తరణ, దేశవ్యాప్తంగా ఉన్న మొలాసిస్ ఆధారిత డిస్టిలరీలను డ్యూయల్ ఫీడ్ డిస్టిలరీలుగా మార్చడం కోసం 06.03.2025న కొత్త పథకం ప్రకటించబడిందని తెలిపారు. ఈ పథకం ద్వారా కోఆపరేటివ్ షుగర్ మిల్స్ తమ షుగర్‌కేన్ ఆధారిత ఎథనాల్ ప్లాంట్లను మల్టీ-ఫీడ్ ప్లాంట్లుగా మార్చిడి చేసుకోవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చెరకు పంటపై పరిశోధన కోసం ప్రత్యేక శాస్త్ర పరిశోధన సంస్థల ఏర్పాటు గురించి వివరిస్తూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో మూడు చక్కెర పరిశోధనా కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా అనకాపల్లిలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృష్ణా జిల్లా, వుయ్యూరులో చక్కెర పరిశోధనా కేంద్రం, తిరుపతి జిల్లా పెరుమాళ్లపల్లిలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం నూతన చెరకు విత్తన రకాలను అభివృద్ధి చేసి రైతులకు అందించేందుకు పని చేస్తున్నాయని తెలిపారు.

## కాణిపాకం గణనాథుని సేవలో ఏపీ ప్రభుత్వ సలహాదారుడు

ఐరాల మేజర్‌న్యూస్‌: కాణిపాకం స్వయంభూ శ్రీ వ రసిద్ధి వినాయక స్వామి వారిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్ రావు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. స్వామి వారి సందర్శ నార్థం విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం రాజగోపురం వద్ద ఆలయ వేదపండితులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ అశ్వరచన మండపంలో వేదపండితుల చే అశ్వరచన చేసిన తరువాత టెంపుల్ ఇన్ స్పెక్టర్ బాలాజీ నాయుడు చేతులు మీదగా స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలు శేష వస్త్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఎస్ ఐ ధరనిధర తదితరులు పాల్గొన్నారు.

# సమష్టిగా కేవీబి పురం మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం

**- ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే ఆదిమూలం**
**- బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ**
**- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ**



**కే వి బి పురం, మేజర్‌న్యూస్‌:** ఐకమత్యంతో సమిష్టిగా కేవీబీ పురం మండలాన్ని సమగ్ర అభివృద్ధి చేసుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిచ్చాటూరు, నాగలాపురం మండలాలలో పర్యటించారు. ఉదయం 10 గంటలకు పిచ్చటూరు టీచర్స్ కాలనీకి చేరుకొని పది రోజుల క్రితం మరణించిన యువకుడు ఈశ్వర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. అక్కడ నుండి కేవీబి పురం ఎంపీడీఓ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో విభేదాలు మాని, అభివృద్ధికి సహకరించాలని నేతలను, ప్రజా ప్రతినిధులను కోరారు.అలాగే మన చంద్రన్న ప్రభుత్వం అమలు చేయనున్న సొంత ఇల్లు లేని పేదలకు 3 సెంట్లు ఇంటి పట్టాల పంపిణీ, పక్కా ఇళ్లు నిర్మాణం, కొత్త రేషన్ కార్డు, కొత్త ఫించను పంపిణీ పథకాలను కుల,మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేసేందుకు కృషి చేయాలన్నారు. తద్వారా ప్రభుత్వానికి, తెలుగుదేశం పార్టీకి మంచి పేరు తేవాలని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ అయ్యే విధంగా స్థానిక నేతలు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దిశా, నిర్దేశం చేశారు.అనంతరం బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అక్కడ నుండి వగత్తూరు చేరుకొని ఏపీ మోడల్ స్కూల్ ఛైర్మన్ అవసరం సురేష్ మాతృమూర్తి జయలక్ష్మి చిత్రపటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి ఘటించారు. అనంతరం సురేష్ ను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన తిరుగిరులు

**- ఘనంగా అన్నమయ్య వర్ధంతి**

**తిరుమల మేజర్‌న్యూస్‌:** పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఊంజల్‌సేవలో నిర్వహించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో సప్తగిరులు పులకించాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీమాన్ శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు. అన్నమయ్యకు, వారి ఆచార్యపీఠమైన అహోబిల మఠానికి ఎంతో అనుబం ధం ఉందని తెలిపారు. అహోబిలం నరసింహస్వామివారి అనుగ్రహంతో తాళ్లపాక అన్నమా చార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారని వివరించారు. ఈ మంత్రోపదేశంలోని 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా టీటీడీ అన్నమయ్య జయంతి, వర్ధంతి ఉత్సవాలను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్వామీజీకి టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ముందుగా దినం ద్వాదశి, సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంలో భాగంగా "దినము ద్వాదశి నేడు , భావములోన బాహ్యము నందును., బ్రహ్మ కడిగిన పాదము, ఎంత మాత్రమున ఎవ్వరు దలిచిన., పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా., కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు వాడు వంటి కీర్తనలను కళాకారులు రసరమ్యంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు, శ్రీవారి ఆలయ పేష్కార్ రామ కృష్ణ, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే ఆరా

**పలమనేరు, మేజర్‌న్యూస్‌:** నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి అధికారులతో బుధవారం ఆరా తీశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మున్సిపల్, అటవీ, రెవిన్యూ అధికారులతో విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలు, మున్సిపల్ పరిధిలోని తాగునీటి బోర్ల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, వీధి వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలు, పెండింగ్ లో మున్సిపల్ షాపింగ్ కంప్లెక్స్ పనులపై చర్చించారు. అదేవిధంగా గంటావూరు కాలనీలో ఇంటిపట్టాల వివాదం పై రెవిన్యూ అధికారులతో ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక పలమనేరు మండలంలోని ముసలిమడుగు వద్ద ఏర్పాటు కానున్న ఎలిఫెంట్ హబ్ పనుల పై స్థానిక ఎఫ్ఆర్వో నారాయణతో ఆయన సమీక్షించారు. ఇప్పటిదాకా జరిగిన పనులను త్వరలో వచ్చి పరిశీలిస్తామని ఆ ప్రాజెక్ట్ ఏర్పాటులో ఏదేని ఇబ్బందులుంటే తెలియజేస్తే పరిష్కారానికి చొరవ చూపుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎఫ్ ఆర్ ఓ నారాయణ, మెప్మా అధికారి బాబా, తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి : విప్ థామస్



**ఎన్ఆర్‌పురం మేజర్‌న్యూస్ :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అని ప్రభుత్వ విప్ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ అన్నారు. బుధవారం మండలం ప్రెస్‌క్లబ్‌ను ప్రభుత్వ విప్ ఏపీడ బ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లోకనాథం ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఉన్న మీడియా మిత్రులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని నియోజక వర్గంలో ఉన్న మీడియా మిత్రులను తాను ఎప్పుడు మీడియా మిత్రులు చూడలేదని నా సొంత అన్నదమ్ముల్లాగా చూస్తానని, అదేవిధంగా ప్రెస్ క్లబ్ సొంత భవనానికి స్థలం కేటాయిస్తానని పేర్కొన్నారు. త్వరలోనే మీడియా మిత్రులకు ఇళ్ల స్థలాలను నియోజకవర్గంలో ఎంతమంది విలేకరులు ఉన్న వారికి మూడు సెంట్లు భూమిని కేటాయిస్తానని ప్రెస్‌క్లబ్‌కు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని బహిరంగ హామీల వర్షం కురిపించారు. మీడియా మిత్రులకు ఏ సమస్య ఉన్న తనకు వెంటనే తెలియజేస్తే పరిష్కరిస్తానని అన్నారు. అంతకుముందుగా ప్రభుత్వ విప్ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ను ఏపీడబ్ల్యూజే నాయకులు సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రమేష్ బాబు, సెక్రటరీ కాలేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జయప్రకాష్, ఆంధ్రజ్యోతి బ్యూరో కరీం , జిల్లా ఈసీ మెంబర్ రాజేష్, రమేష్, వెంకటేష్, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నిర్వాహకులు తిరుమల, నియోజకవర్గ మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

**చంద్రగిరి, మేజర్ న్యూస్:** చంద్రగిరి గ్రామ దేవత మూలస్థానం ఎల్లమ్మ దేవస్థానం నందు 2025జనవరి 9వ తేదీ నుండి 2025మార్చి 26వ తేదీవరకుభక్తులు హుండీలలో వేసిన కానుకలనుతిరుపతి దేవాదాయ, ధర్మాదాయశాఖడివిజన్ తనిఖీదారు పి. ఫణి రాజశయన వారి సమక్షంలో హుండీ లెక్కించగా రూ.6,21,058ల నగదు, బంగారు 28 గ్రాముల 600మిల్లీగ్రాములు, వెండి218 గ్రాముల 350మిల్లీ గ్రాములు వచ్చిందని ,ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి,తో పాటు సభ్యులు పాల్గొన్నారనిఆలయ కార్యనిర్వాహణాధికారి కే. మమతతెలిపారు. అలాగే కొత్త చెర్లోపల్లిశ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు 2024 అక్టోబర్ 23 తేదీనుండి 2025 మార్చి 26వ తేదీ వరకు భక్తులు హుండీలో వేసినకానుకలను తిరుపతి దేవాదాయ ధర్మాదాయ శాఖ డివిజన్తనిఖీదారు పి.ఫణిరాజ శయనసమక్షంలో హుండి లెక్కించగా రూ.1,86,341ల నగదు వచ్చిందని కార్యనిర్వాహణాధికారి అధికారి కే. మమత తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



**సత్యవేడు, మేజర్‌న్యూస్:** నాగలాపురం మండలం బీరకుప్పం కు చెందిన బాలురులు సారథి, ఉదయ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి ఎలైట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం మధ్యాహ్నం తిరుపతి ఎలైట్ హాస్పిటల్‌కు చేరుకొని సారథి, ఉదయ్‌లను పరామర్శించారు. గాయపడిన యువకులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. సారథి, ఉదయ్‌లు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## పాలల్లో కల్తీని అరికట్టాలి

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరంలో ఓ ప్రైవేటు పాల సేకరణ కేంద్రంలో రైతుల నుంచి సమపాలల్లో వెన్న శాతం కలిగిన స్వచ్ఛమైన పాలన తక్కువ ధరకు కొని అందులో విపరీతమైన కల్తీ చేసి రైతులు పోసిన పాలల్లో ఉన్న వెన్న శాతం కన్న చాలా తక్కువ వెన్న శాతం కలిగిన నాణ్యతలేని పాలను అధిక ధరకు స్థానిక ప్రజలకు విక్రయించడాన్ని తెలుసుకున్న సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రమణ్యం ఆహార పదార్థాల కల్తీ నిరోధక శాఖ ఇన్స్పెక్టర్ కలిసి పాలలో జరుగుతున్న కల్తీపై నిఘా ఉంచి ప్రజా ఆరోగ్య దృష్టిలో ఉంచుకొని పాలలో కల్తీ నూజివీడు అయితే ఆహార పదార్థాల కల్పిని నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. అదేవిధంగా పాలు పోస్తున్న రైతులకు ఎక్కువ ధర చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. కొంతమంది రైతులు ముందుగానే అడ్వాన్స్ రూపంలో కొంత సొమ్మును ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేస్తున్న అనేక ఆరోపణలు కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఆగడాలను అరికట్టడానికి ప్రభుత్వమే పాలను కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి నాణ్యమైన పాలను స్థానిక ప్రజానీకానికి రైతుల నుండి కొనుగోలు చేసిన రేటుకు ఖర్చులు కలుపుకొని కల్తీ లేని పాలను విక్రయించేటట్లు చర్యలు చేపట్టాలని కోరారు. పాల రైతులు ప్రైవేట్ వ్యక్తులపై అప్పుల కోసం ఆధారపడకుండా ఆవులు దానాకు కొనడానికి ప్రభుత్వమే బ్యాంకు నుంచి పాడి రైతులకు సబ్సిడీ ద్వారా లోన్లు మంజూరు చేయాలని కోరడంతో పాటు పాల కల్తీపై రాజీలేని పోరాటాలు చేయడానికి వెనకడుగు వేసే ప్రసక్తి లేదని ఆయన తెలిపారు.

## సోమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



పెళ్లకూరు మేజర్ న్యూస్ : సర్వేపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు, మాజీ మంత్రి,పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ని మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు వేలూరు కళ్యాణ్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి హార్దిక శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు సునీల్, రమాశంకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుగుటూరు గంగమ్మ జాతరలో అపశృతి



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో జరుగుతున్న గంగ జాతరలో బుధవారం టిడిపి నేత ఆర్‌విటి బాబు కమెడియన్ సప్తగిరి హెలికాప్టర్ ద్వారా అమ్మవారి గుడి మీద పూలు చల్లారు. ఈ క్రమంలో హెలికాప్టర్ కిందకి రావడంతో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన షామియానాలు గాలికి కూలిపోయాయి. ఈ విషయంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## చౌడేపల్లి హెచ్ డీటీగా నందిని దేవి



**చౌడపల్లి రూరల్ మేజర్‌న్యూస్:** మండల హెచ్ డిటిగా నందిని దేవి నియమితులయారు ఈ మేరకు ఆమె బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు ఇప్పటివరకు ఆర్ఎస్ డిటిగా ఉన్న మాధవి మెటర్నటి సెలవుపై ఉన్నారు పలమనేరు తాసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా ఉన్న నందిని దేవి పదోన్నతి పై చౌడేపల్లిగా నియమితులయ్యారు.

## కార్యదర్శి రమేష్ కు సన్మానం



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని మొండి వెంగనపల్లి పంచాయతీ కార్యదర్శి ఏ. రమేష్ కు గ్రేట్ 4గా పదోన్నతి లభించడం పట్ల టిడిపి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బట్టే చాణిక్య ప్రతాప్ సన్మానించారు. కార్యదర్శి రమేష్ విధులు పట్ల అంకిత భావంతో పనిచేయడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ప్రకాష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## పదోతరగతి భౌతిక శాస్త్రం పరీక్ష కు 1369 మంది హాజరు

**పలమనేరు, మేజర్ న్యూస్:** పలమనేరు మండలంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో భాగంగా ఆరవ రోజు భౌతిక శాస్త్రం పరీక్ష కు 7 సెంటర్స్ లో మొత్తం 1377 మంది విద్యార్థులకు గాను 1369 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరైనారు. బుధవారం 8 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయినారు. మండలంలో సెంటర్స్‌లో విద్యార్థినీవిద్యార్థుల కు ఫర్నిచర్,త్రాగునీరు, లైట్స్, ఫాన్స్ సౌకర్యం అందించడం జరిగింది. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ప్రశాంత వాతావరణం జరిగిందని మండల విద్యా శాఖాధికారులు పి.లీలారాణి,సి. బాల సుందరం తెలియజేసినారు.

## విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలి

**– ఆర్టీసీ ఆర్ఎంను కోరిన ఎమ్మెల్యే ఆదిమూలం**



పిచ్చాటూరు, మేజర్‌న్యూస్: విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం ఐదు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌ను కోరారు. బుధవారం సాయంత్రం తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటిది సత్యవేడు నుండి వయా సంతవేలూరు మీదుగా సూళ్లూరుపేట వరకు బస్సు సర్వీసు ను రోజుకు రెండు ట్రిప్పులు నడపాలన్నారు. రెండవది పిచ్చాటూరు నుండి వయా ఎస్ ఎస్ బి పేట, హనుమంతపురం మీదుగా దాసు కుప్పం వరకు బస్సు సర్వీసును ప్రారంభించాలన్నారు. మూడవది సత్యవేడు నుండి తిరుమలకు డైరెక్ట్ ఎక్స్ ప్రెస్ సర్వీసును ప్రారంభించాలన్నారు. నాల్గవది ప్రతి రోజు రాత్రి 8 గంటలకు సత్యవేడు నుండి ప్రారంభమై వరదయ్యపాలెం మీదుగా శ్రీకాళహస్తి వరకు ఆర్టీసీ సర్వీసును నడపాలని కోరారు. చివరగా విద్యార్థుల సౌకర్యార్థం వేసవి శెలవులు అనంతరం శ్రీకాళహస్తి నుండి దిగవ పుత్తూరు మీదుగా పిచ్చాటూరు వరకు సర్వీసు కోసం ఎమ్మెల్యే విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తప్పక పరిశీలించి, బస్సు నడిపే ప్రయత్నం చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## పాలలో జరుగుతున్న కల్తీని అరికట్టాలి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** పాలలో జరుగుతున్న కల్తీని అరికట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని ఆహార పదార్థాల కల్తీ నిరోధక శాఖ ఇన్స్పెక్టర్ కు సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వేటినగరం మండల కేంద్రంలోనీ ఒక ప్రైవేట్ పాల సేకరణ కేంద్రంలో రైతుల నుండి సమపాళ్లలో వెన్న శాతం కలిగిన స్వచ్ఛమైన పాలను తక్కువ ధరకు కొని, అందులో విపరీతమైన కల్తీ చేసి..రైతులు పోసిన పాలల్లో ఉన్న వెన్న శాతం కంటే చాలా తక్కువ వెన్నశాతం కలిగిన, నాణ్యతలేని పాలను అధిక ధరలకు ప్రజలకు విక్రయించడం దారుణమన్నారు. పాలలో జరుగుతున్న కల్తీపై నిఘా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని,కల్తీ జరిగినట్లు రుజువైతే..వారిపై ఆహార పదార్థాల కల్తీ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని కోరారు. అదేవిధంగా పాలు పోస్తున్న రైతులకు ఎక్కువ ధర చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. కొంత మంది పాలు పోస్తున్న రైతులకు ముందుగానే అడ్వాన్స్ రూపంలో కొంత డబ్బును ఇవ్వడం,అధిక వడ్డీ వారి నుంచి గుంజడం వంటి సంఘటనలను అధికార దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ప్రైవేట్ వ్యక్తుల ఆగడాలను అరికట్టడానికి ప్రభుత్వమే పాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన పాలను స్థానిక ప్రజలకు రైతుల నుంచి కొనుగోలు చేసిన రేటుకు ఖర్చులు కలుపుకొని కల్తీ లేని పాలను విక్రయించేటట్లు చర్యలు చేపట్టాలని కోరారు. పాల రైతులు ప్రైవేట్ వ్యక్తులపై అప్పుల కోసం ఆధారపడకుండా ఆవులు, దానా కొనడానికి ప్రభుత్వమే బ్యాంకు నుంచి పాడి రైతులకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరారు. పాల కల్తీపై రాజీలేని పోరాటం చేయడానికి తాము వెనుకాడబోమని స్పష్టం చేశారు.

## నూతన బీజేపీ కార్యాలయం ప్రారంభం



**తడ, మేజర్‌న్యూస్:** మండలంలో భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయం భవనాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. బిజెపి మండల అధ్యక్షులు చిల్లకూరు తేజరెడ్డి జన్మదినం సందర్భంగా నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సన్నారెడ్డి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశ అభివృద్ధి సంక్షేమంలో ఎంతో పురోగతి సాధించిందని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పై కార్యక్రమంలో జిల్లా ఫోర్ కమిటీ సభ్యులు ఆరణి విజయభాస్కర్ రెడ్డి, నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జ్ ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయమ్మ, బిజెపి సీనియర్ నాయకులు చెన్నకేశవులు, తడ మండల, సూళ్లూరు పేట నియోజకవర్గ బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్లింలకు ఎమ్మెల్యే, ఎంపీ ఇఫ్తార్ విందు



**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** మండలంలో ముస్లింలకు పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ఇఫ్తార్ విందును ఇచ్చారు. మండలంలోని రొంపిచెర్ల, బొమ్మయ్యగారి పల్లి, పెద్దగొట్టిగల్లు, బండకింద పల్లి, పెద్దమల్లెల కాస్పా పేట, పాతపేట, బండకింద పల్లి గ్రామపంచాయతీల లోని మసీదులకు ఈ విందును అందించి ఉపవాసాలు ఉన్న ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లా డుతూ ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, మండల కన్వీనర్ చెంచురెడ్డి ముస్లీం మైనార్టీ నాయకులు సలీం బాషా, అల్లాబక్షు, ఎల్.మహబూబ్ బాషా, కరీముల్లా, రాజా సాహెబ్, మంజూర్, ఖలీల్, అల్లాబక్షు, సాబిల్, ఐడియా కాలేషా, సైఫుల్లా ఖాన్, ఇజాజ్ భాయ్, బుడన్ సాబ్, గోస, మాబ్బాషా, బావాజీ సాహెబ్, నిజాముద్దీన్, అబూ బకర్, అహ్మదలీ బేగ్, జి. ఎం. బాషా, వైఎస్ఆర్సీపీ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, కమలాకర్ రెడ్డి, రామనారాయణ రెడ్డి, కోటా వెంకటరమణ, సుధాకర్ రెడ్డి, ఓబులేషు, గురు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది రోజున స్విమ్స్‌లో గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించరు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) రేడియాలజి విభాగం వారి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం గర్భిణీ స్త్రీలకు అల్ట్రాసౌండ్ (అబ్జెటిక్) పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతున్నది. 30.03.2025వ తేది (ఆదివారం) ఉగాది పండుగ సెలవు రోజు కారణంగా స్కానింగ్ పరీక్షలు ఆ రోజు నిర్వహించబడవు తిరిగి 06.04.2025వ తేది ఆదివారం నుండి యదాతథంగా గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని గర్భిణీ స్త్రీలు 06.04.2025వ తేది నుండి పరీక్షలను చేయించుకోవచ్చునని మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## చోరీ కేసులో నిందితుడికి మూడు నెలలు జైలు శిక్ష



**చిత్తూరుక్రైమ్ మేజర్‌న్యూస్:** మాజీ ఎమ్మెల్యే సి.కె.బాబు ఇంట్లో దొంగ తనం కేసులో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు 5వ అదనపు సివిల్ జడ్జి, స్పెషల్ మైబైల్ కోర్టు జడ్జి పి. వెన్నెల బుధవారం తీర్పు ప్రకటించారు. చిత్తూరు నగరం లోని మాజీ ఎమ్మెల్యే సి.కె.బాబు ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న నిందితుడు జి. మహేష్ 30 సం., 2023 సం, లో ఓ రాత్రి ఎగ్జాస్ట్ సందు ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూ. 1,00,000 దొంగతనం చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే సతీమణి ఫిర్యాదు మేరకు అప్పటి క్రైమ్ స్టేషన్ ఎస్.ఐ ఉమామహేశ్వర రావు కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి క్రైమ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ భాస్కర్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టి సాంకేతిక ఆధారాలను ఉపయోగించి నిందితుడు మహేష్‌ను గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నిందితుడిపై ఆరోపణలు రుజువుకావడంతో బుధవారం చిత్తూరు 5వ అదనపు సివిల్ జడ్జి, స్పెషల్ మైబైల్ కోర్టు జడ్జి పి. వెన్నెల నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కేసును విజయవంతంగా విచారణకు తీసుకువెళ్లి శిక్ష పడేలా కృషి చేసిన ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర రావు, భాస్కర్, కేసుకు ఏపీపీ గా వ్యవహరించిన స్వాతి, కోర్టుకు సాక్షులను సమయానికి హాజరు చేసిన కోర్ట్ కానిస్టేబుల్ శ్రావణ్, కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందిని చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు అభినందించారు.

# మార్చి 31 లోపు రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ లేదంటే భవిష్యత్తులో ఇబ్బందులు



**తడ, మేజర్‌న్యూస్ :** మండలంలో వున్న రేషన్ కార్డు లబ్ధిదారులకు ఈ కేవైసీ ప్రక్రియను ఈ నెల 31 తేదీలోపు పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లు పౌరసరఫరాల అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈ కేవైసీ ప్రక్రియను నూటికి నూరు శాతం పూర్తి చేయాల్సి ఉంది. రేషన్ డీలర్లు, తహసిల్దార్లు, డి ఎస్ ఓ లు, కలెక్టర్లు సివిల్ సప్లయర్స్ లాగిన్ లో ఈ కేవైసీ యూనిట్లో అందుబాటులో ఉన్నాయి. గ్రామ వార్డు సచివాలయ మొబైల్ యాప్ రేషన్ షాపులోని ఈ ఫోన్ పరికరాల ద్వారా ఈ కేవైసీనే అప్డేట్ చేసుకునే సౌకర్యం ఉంది. ఐదు సంవత్సరాలలోపు పిల్లల మినహా మిగిలిన లబ్ధిదారులందరినీ ఈకేవైసీ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి లేకపోతే రేషన్ కార్డుదారులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పౌరు సరఫరాల శాఖ కమిషనర్ హెచ్చరికలు జారీ చేశారు. కాబట్టి మన ప్రజలు అందరూ సహకరించి కొని ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవలని తడ తహసిల్దార్ ఎన్ శరత్ బాబు తెలియజేసారు.

## 28న వారం సంత వేలం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరంలో ఉన్న రాజా కుమార్ స్వామి రాజా వారం సంత, కూరగాయల మార్కెట్, బస్టాండు, జంతు వదశాల, సంబంధించి 28 తేదీ శుక్రవారం 11 గంటలకు కార్వేటి నగరం గ్రామపంచాయతీలో కార్యాలయం ఆవరణలో వేలంపాట నిర్వహించడం జరుగుతుందని పంచాయతీ ఈవో నాగరత్నమ్మ తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనేవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. వివరాలకు కార్యాలయం పని దినాల్లో సంప్రదించాలని తెలిపారు.

## ఎంపీపీ నిధులతో తాగునీటి బోరు



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని గొడుగు చింత పంచాయతీ తార్లబైలు-పాలమడుగు ఇండ్లు దగ్గర ఎంపీపీ నిధులతో తాగునీటి బోరు డ్రిల్లింగ్ చేసినట్లు పెరుమాళ్ళపల్లి ఎంపీటీసీ తోకల మురళి రెడ్డి తెలిపారు. తార్ల బైలు గ్రామానికి తాగునీటి వసతి లేకపోవడంతో గుర్తించిన ఎంపీటీసీ ఎంపీపీ నిధులను వెచ్చించి బుధవారం తాగు నీటి బోరును డ్రిల్లింగ్ చేయడం జరిగిందన్నారు. నీళ్లు సమృద్ధిగా పడటంతో గ్రామ ప్రజలు స్థానిక ఎంపీటీసీ తోకల మురళి రెడ్డిని అభినందించారు.

## విద్యార్థులకు ఎనర్జీ డ్రింక్ పంపిణీ



**తొట్టంబేడు, మేజర్ న్యూస్:** సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రముఖ సంఘ సేవకులు, శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు పిలుపు నిచ్చారు. వేసవిలో ఎండ తీవ్రత దృష్టిలో బుధవారం మండల పరిధిలోని శేషమనాయుడు కండ్రిగలో 45 మంది, పూడిలో 40 మంది, ఇలగనూరులో 50 మంది, ఇలగనూరు అంగ న్వాడీ కేంద్రంలో 12 మంది, గుర్రప్పనాయుడు కండ్రిగలో 22 మంది, గాంధీ సెంటరులో 20 మంది, పెద్ద కనపర్తిలో 36 మంది, మొత్తం 224 మంది విద్యార్థులకు ఓఆర్ఎస్, ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్నులో 50 శాతం వడ్డీ రాయితీ

**- కమిషనర్ షేక్ .ఫజులుల్లా**



**నాయుడుపేట, మేజర్ న్యూస్ :** పట్టణ పురపాలక సంస్థ పరిధిలో భవనములు, ఖాళీ స్థలాలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి సంబంధించిన పన్నులను ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలని కమిషనర్ షేక్.ఫజులుల్లా తెలిపారు. వారికి 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్నులను స్థానికంగా వార్డు సచివాలయాల్లోనూ చెల్లించవచ్చని తెలిపారు.

## మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడండి

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్ న్యూస్:** పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల స్థలాన్ని కాపాడాలని శ్రీకాళహస్తి పిడిఎస్యు విద్యార్థి సంఘం నాయకులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ మహిళా కళాశాలకు మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సుమారు 7 ఎకరాలు స్థలం కేటాయించడం జరిగింది. ఆ స్థలం మొత్తం కబ్జాకు గురి కావడం జరిగిందని వెంటన కాపాడి కాంపౌండ్ నిర్మించాలని కోరారు. కబ్జాదారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ మహిళ కళాశాలలో సుమారు 2000 మంది ఆడబిడ్డలో విద్యాబాలసం చేస్తున్నారని వారికి భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



# బాలికలకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కంపెనీ స్కాలర్షిప్ పంపిణీ




**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** తిరుపతిలోనే మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు 141 మంది బాలికలకు స్కాలర్షిప్లను బుధవారం తన షోరూంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎం మౌర్య విచ్చేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం నందు తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్ మౌర్య, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షో రూమ్ హెడ్ కె రిజెష్ విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యొక్క ఇతర మేనేజ్ మెంట్ టీమ్ సభ్యులు, కష్టమర్లు, శ్రేయోభిలాషులు మరియు విదార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు మొదలగువారు పాల్గొనారు. తిరుపతి కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం, బాలికల చదువుల కోసం తమ ఆదాయంలో 5 శాతం స్కాలర్షిప్ రూపంలో బాలికలకు అందజేయడం గొప్ప నిర్ణయం అన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం యాజమాన్యాన్ని కమిషనర్ అభినందించారు. అనంతరం షోరూం హెడ్ రిజేష్ మాట్లాడుతూ ఈ ఏడాది భారతదేశ వాప్తంగా 21,000 మంది బాలికల విద్యకు మద్దతుగా 16 కోట్ల రూపాయలను కేటాయించారని,ఆంధ్ర రాష్ట్రంలోని 142 కళాశాలల్లో చదువుతున్న 1,928 మంది బాలికల విద్యకు మద్దతుగా ఆంధ్ర రాష్ట్రంలో ఈ సాలర్షిప్ కార్యక్రమానికి గాను రూ 1.67 కోట్లు కేటాయించిందని తెలిపారు. మలబార్ ట్రస్ట్ 1999 సంవత్సరంలో ప్రారంభించబడిందని,ఈ ట్రస్టు ద్వార తిరుపతి పరిసర ప్రాంతాల్లో పేదవారికి దాదాపు 400 మందికి ఉదయం పూట టిఫిన్ పంపిణీ కార్యక్రమం కూడా జరుగుతుంది అని తెలిపారు. 2007లో ప్రారంభించబడిన మలబార్ నేషనల్ సాలర్షిప్ ప్రోగ్రామ్ మలబార్ గ్రూపు సామాజిక సేవా కారక్రమాల్లో ఒక ముఖ్యచొరవగా నిలుస్తుందని, ఇప్పటి వరకు, భారతదేశ వాప్తంగా 95,000 మందికి పైబడి బాలికలకు ఆర్థిక సహాయం అందించడం మైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో 60 కోట్ల రూపాయలు వెచ్చించారని, ఆంధ్ర రాష్ట్రంలో 13,700 మంది విదార్థినులకు ఆర్థిక సహాయం అందించడానికి రూ. 6.29 కోట్ల రూపాయిలు వెచించారు. సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించమే లక్షంగా పనిచేస్తుంది, భావితరాలకు సామాజిక, ఆర్థిక పురోగతికి సాధనాలు ఉండేలా కృషి చేస్తుందని తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ చెంచు బాబు

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** బెట్టింగులకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎవరైనా క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమ్ యాప్‌లకి అలవాటు పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ కి పాల్పడిన, ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవని నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు హెచ్చరించారు. ఐపీఎల్ జరుగుతున్న సందర్భంగా ఎక్కడైనా ఎవరైనా బెట్టింగ్ పెడుతుంటే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు డయల్ 100కు కాల్‌చేసి తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన నేటి దినపత్రిక సూర్య ప్రతినిధితో మాట్లాడుతూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ లు సోషల్ మీడియాలో వీటిని ప్రోత్సహించడం వల్ల యువతలో దీని వ్యసనం పెరుగుతుందన్నారు. వీటి కట్టడికి పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.



**క్రికెట్ బెట్టింగ్ ల జోలికెళ్ళి జీవితాలు నాశనం చేసుకోకండి...**

అమాయక ప్రజలను, యువకులను లక్ష్యంగా చేసుకొని, ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ఆశలు రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగునున్న నేపథ్యంలో నాయుడుపేట , ఓజిలి, అన్ని మండలాల వ్యాప్తంగా పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెట్టడం జరిగిందన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టాలని, తమ తల్లిదండ్రుల కోసం ఉన్నతంగా బ్రతకాలని, బెట్టింగ్ రాయుళ్ళ వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు సూచించారు.

**ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి...**

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేకుంటే వాటిని ఉల్లంఘించిన వారిపై జరిమానా తప్పదని ఆమె తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవింగ్ చేస్తున్న వారు సీటు బెల్టు ధరించాలన్నారు.సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ , మద్యం సేవించి వాహనాలు నడప రాదని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు. పట్టణ ప్రజలకు, అలాగే అన్ని మండలాల ప్రజలకు ముందుగా ఉగాది, రంజన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## 29న శ్రీ శనీశ్వరాలయంలో విశేష పూజలు



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** ఈనెల 29వ తేదీ శనివారం శని దేవుడి జన్మ నక్షత్రం ఉత్తరాభాద్ర నక్షత్రం మరియు శని సంక్రమణం, శని దేవుడు మీనరాశి ప్రవేశం, ఏలునాటి శని మేషరాశి ఆరంభం, మకర రాశికి ఏలినాటి శని నుంచి విముక్తి రోజు కనుక శని దేవుని పూజలకు విశేష పర్వదినం అని ఉంగరాల సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. రామచంద్రపురం మండలం రాయల చెరువు పంచాయతీ ఛాయాపురంలో వెలిసి ఉన్న శ్రీ శనీశ్వర ఆల యంలో ఈనెల 29వ తేదీ శనివారం విశేష పూజలు జరుగుతాయని ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రమణ్య శర్మ తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఈ పర్వదినం రోజు శ్రీ శనీశ్వర స్వామి వారి పూజలో పాల్గొని తమ కష్టాలను తొలగించుకోవాలని కోరారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేశారని, అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తారని తెలిపారు.

## శ్రీ కోదండ రామస్వామివారికి రాగి ఆభరణాలు బహూకరణ

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** తిరుపతి శ్రీ కోదండ రామస్వామివారికి రూ.4.10 లక్షల విలువైన బంగారు పూత వేసిన రాగి ఆభరణాలను బుధవారం చెన్నైకి చెందిన శ్రీధర్ మర వారి కుటుంబ సభ్యులు కానుకగా సమర్పించారు. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్నకు వీటిని అందించారు బహుకరించిన వాటిలో ఉత్సవమూర్తులకు అలంకరించే ఆరు హస్త కవచాలు, ఆరు పాద కవచాలు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## నత్తం కండిగా దళితవాడ ప్రజలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

**నగరి, మేజర్ న్యూస్:** నగరి మున్సిపాలిటీలోని తొమ్మిదవ వార్డులోని నెత్తం కండ్రిగ దళితవాడలో నివసించు దళితులకు నివాసం ఉంటున్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టాచ్ నుంచి ఆర్డిఓ కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు. సిపిఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పూరీ ఇల్లులు నిర్మించుకొని సుమారు 80 కుటుంబాల జీవిస్తున్నారు. వీరు నివాసం ఉన్న స్థలాలకి ఇంటి పట్టాల కేటాయించాలని అనేకసార్లు అధికారులు దృష్టికి తీసుకువచ్చిన సమస్య పరిష్కారం కాలేదు. అక్కడ నివాసం ఉంటున్న వారికి ఇంటి పటాలిచ్చి అరులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే చలో కలెక్టరేట్ పిలుపునిచ్చి కలెక్టర్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్తామన్నారు. అనంతరం ఇంటి పట్టాలు ఇవ్వాలని అర్హులకు ఇంటి స్థలాలు కేటాయించాలని ఆర్డీవోకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు సిపిఐ పార్టీ నగరి నియోజక వర్గ కార్యదర్శి కోదండయ్యా సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేల న్ ఏఐటియుసి నాయకులు బాషా, విజయ్‌కుమార్, గ్రామ కమిటీ నాయకులు యేసయ్య, ముత్తు బాబు, కృష్ణమూర్తి, కుప్పయ్య బాబు, సురేష్, రాజు, వేలు, జేమ్స్, మేరీ, భారతి, కాంచన, ఐశ్వర్య, లైలా, కుండెమ్మ, రాణి, మహిళలు పాల్గొన్నారు.



# ప్రజలు, వారి సమస్యలు పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం

**శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణం పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజా సమస్యలు పరిష్కారానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రతి మండలం నుండి ప్రజలు నుంచి ఫిర్యాదులు వినతులు తీసుకోవడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలు శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రభుత్వమని, మీ సమస్యలు పరిష్కరించడం మే నా ప్రథమ కర్తవ్యం అని తెలియ జేయడం జరిగింది. రెవిన్యూ సమస్యలు ఒక టైం కేటాయించి ఆ టైంలోపల పని పూర్తి అయ్యేవిధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చేమని తెలిపారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువ వస్తున్నాయని వాటిని పరిష్కరించి పేదలకు న్యాయం చేస్తామని తెలిపారు. ఏప్రిల్ నెలలో మా తండ్రి మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా ఈ పది నెలలు కాలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు మండలాలు వారిగా. గ్రామాలు వారిగా శ్వేత పత్రం ప్రకటిస్తామని తెలిపారు. వారానికి రెండు రోజులు శ్రీకాళహస్తి పట్టణంలో ప్రజలు నుండి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు. మండల పరిషత్ అధికారులు. హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.



# పనిచేయని పోలీస్ ఈ చలానా యాప్

(మొదటిపేజీ తరువాయి)

కోర్టుల ద్వారానే పోలీస్ శాఖకు చెల్లిస్తున్నారు.

**రాంగ్ రూట్లో వస్తే ఫైన్ కట్టాల్సిందే...** జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించారు. తిరుపతి జిల్లా ఎవరైనా ఎక్కడైనా వాహనాలను రాంగ్ రూట్లో వస్తే తప్పనిసరిగా అలాంటి వారిని గుర్తించి వారి వాహనాలను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాంటి వాహనదారులకు కోర్టుల ద్వారా ఫైన్ లను చెల్లించేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా రాంగ్ రూట్లో వచ్చే వాహనదారులకు ప్రత్యేక కౌన్సిలింగ్ లను పోలీసుల చేత ఇప్పిస్తున్నారు.

తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రోడ్డు ప్రమాదాల ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ డివిజన్లో వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ప్రతిరోజు సాయంత్రం వేళల్లో పోలీసులు రోడ్లమీద వాహనాల తనిఖీలు చేపట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా కొంతవరకైనా ప్రమాదాలను అరికట్టవచ్చునని జిల్లా వాసులు చెబుతున్నారు.

## ఈ చలానా యాప్ పనిచేయని మాట వాస్తవమే

ఫైన్లను అప్లోడ్ చేసే పోలీస్ ఈ చలానా యాప్ పనిచేయని మాట వాస్తవమేనని, ఈ యాప్ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున పూర్తిస్థాయిలో మోడిఫికేషన్ చేసి త్వరలో అందుబాటులోకి రానున్నది.

**రామకృష్ణమాచారి, ట్రాఫిక్ డిఎస్పీ, తిరుపతి**

# అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

(మొదటిపేజీ తరువాయి)

శర వేగంగా సాగుతోందన్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికీకరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీక్షా దక్షతలను కొనియాడారు. ముఖ్యమంత్రి ముందు చూపుతో ఈ ప్రాంతం మీదుగా రెండు జాతీయ రహదారులు, పారిశ్రామికవాడ నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ప్రాంతం ప్రపంచ పటంలో నిలుస్తుందన్నారు. అమ్మవారు వెలసిన తూర్పుకనుపూరు గ్రామం కూడ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దేవస్థానం అభవృద్ధితో పాటు ఈప్రాంత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పోలేరమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రజా ప్రతినిధుల వెంట తెలుగుదేశం నాయకులు దశరథ రామిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, దేవాదాయశాఖ అధికారులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# హెూం కంపోస్టింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి : కమిషనర్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఇంటి నుండి ఉత్పత్తి అయ్యే చెత్తతో ఎరువు తయారు చేసుకుని (హెూంకంపోస్టింగ్) మొక్కలకు వినియోగించుకునే విధానంపై ప్రజల్లో ఆవాహన పెంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలో ఖాదీ కాలని, రైల్వే స్టేషన్, ఆటో నగర్ తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎవరి ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే చెత్తను వారే ఎరువుగా చేసే మొక్కలకు వినియోగించుకునేలా హెూమ్ కంపోస్టుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీధుల్లో, కాలువల్లో చెత్త వేయకుండా చూడాలని, అలా ఎవరైనా చేస్తే జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ కాలువలు బ్లాక్ కాకుండా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈలు రమణ, మధు, ఏసిపి లు బాలాజి, మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మహిళ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సమావేశం**

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. "కార్యకర్తే అధినేత" కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రజా దర్బార్‌లో తెలుగుదేశం పార్టీ మహిళ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో పార్టీ కార్యక్రమాలు జరుగుతున్న తీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆర్థిక ఇబ్బందుల మధ్య ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని.. వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ మహిళలు చురుగ్గా పాల్గొనాలన్నారు. కుటుంబ సాధికార సభ్యులను ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, మహిళా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ఇన్చార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

